# పచ్చల శంఖం - యేనుగు పగడం

నేరుగా తమ వైపుకు నడచివస్తున్న జబ్బార్ సాహేబుకేసి పరధ్యానంగా చూస్తూ "పచ్చల శంఖం యీ పక్కనే వుండాల" అని, యింతలో అతడి వెనకే వస్తున్న వ్యక్తిని చూసి పులిక్కిపడి "నువ్వా చిన్నబ్బనాయుడూ! యిక్కడుండావేంది నువ్వు?" అంటూ కంగారుపడ్డాడు పెద్దిరెడ్డి.

"నమస్తే అన్నా! యీ సాయిబు నీ కారుడ్రైవరా? ఆ మాట చెప్పనే లేదు. యెవురో ఆడోళ్ళు గూడా వచ్చుండారే నీతో!" అని చిన్నబ్బనాయుడు గూడా హడావుడి పడసాగాడు.

జబ్బార్ సాహేబు ముందుకొచ్చి "మందుకోసరమొచ్చినామన్నా!" అని అందుకున్నాడు.

"మందుకోసరం యీ పొద్దే రావాల్నా మీరు గూడా!" అంటూ చిన్నబ్బనాయుడు నీరసపడి పోయాడు. "మామూలుగా ఆదివారాల్లో జనం కొంచెం జాస్తిగానే వస్తా వుంటారు. యీ పొద్దు అమావాస్య గూడా కలిసొచ్చిందని పొలోమని దూకేసినారు. నూరుకు తగ్గరు" అని వాపోయాక, "అయితే కొంచేపు కార్లోనే చల్లంగా కుచ్చోండి.... నేనీలోపల సందు జూసి, మిమ్మల్ని క్యూ లోపలికి దూర్చేస్తాను" అంటూ, క్యూ చివర్లోని గుడిసె వైపుకు వెళ్ళిపోయాడు.

రహస్యమేదో చర్చించడం కోసమని బాగా దగ్గరగా వచ్చినట్టున్న కొండల మధ్యలో లోయ అడుగున వున్న పదిరవై యిండ్లపల్లె యెవరికో భయపడి చెట్ల శాలువాను పైకి లాక్కుంటున్నట్టుంటుంది. తలపైకెత్తి చూస్తే, మందుల గుడిసె ముందున్న క్యూ రకరకాల దుస్తులు తొడుక్కున్న వేర్వేరు వయస్సుల మనుషులతో అడవి పూలతో కట్టిన మాలలా చిత్రంగా వుంది. దాని కటువైపున మట్టిగొట్టుకుపోయిన జీపులు రెండూ, పాత బడిన ఆటోలు మూడూ, అస్థిపంజరాల్లాగున్న మోటరు బైకులు నాలుగూ ఆగివున్నాయి.

"కొంచెం ముందూ యెనకా చూసేది లేదారా జబ్బార్! ఆ చిన్నబ్బనాయుడు మనపార్టీగాదని నీకు తెలవదా చెప్పు! సరాసరి నా దగ్గిరికే తొడుక్కోనొచ్చేస్తావా మాదర్చేద్!" అని కసిరాడు పెద్దిరెడ్డి.

"అయ్యయ్యో! బిన్నా మందు దీసుకోని పోదామని ఆ క్యూను కంట్రోలు జేస్తా వుండే పిల్లకాయలను కదిలించినానన్నా! వాళ్ళు చిన్నన్నతో మాట్లాడమన్నారు. తీరా పొయి చూస్తే అక్కడ కొలువుతీరుండేది యీ మనిషే అని తెలిసింది. యెందుకొచ్చినావని అడిగితే, నీ పేరు జెప్పక తప్పలేదు... అంతే! అప్పుడు చూసుండాల ఆ చిన్నబ్బనాయుడి ముగం.. కత్తి దెబ్బకు నెత్తురు చుక్కలేదనుకో! బెదిరిపోయి ఒక పెట్టుతో పరిగెత్తుకోనొచ్చినాడు నీ దగ్గిరికి...." అన్నాడు జబ్బార్ సాహేబు చేతులు నలుపుకుంటూ.

తన మీసాలపైన చేయి వేస్తూ, "యింకైనా కొంచెం కండ్లూ చెవులూ తెరుచుకోనుండు. యీ తావులో ఆ పచ్చల శంఖం దొరికే వుంటిందని, యిప్పుడు నాకు యింకా గట్టిగా నమ్మకం కలగతా వుండాది..." అని హెచ్చరించాడు పెద్దిరెడ్డి. "పచ్చల శంఖమా? అదెట్ల వుంటింది?" అని అడుగుదామని నోరు తెరవబోయిన జబ్బార్ సాహేబు, పెద్దిరెడ్డి ముఖం మొటమొటలాడడం గమనించగానే ఆగిపోయాడు. యింతలో మందుల గుడిసె ముందు నుంచీ చిన్నబ్బనాయుడు చేయి వూపడం కనిపించగానే "అన్నా! ఆ చిన్నబ్బనాయుడు పిలస్తావుండాడు" అన్నాడు.

పెద్దిరెడ్డి వెనుదిరిగి "యింక దిగు కిందికి" అంటూ తన కోపాన్ని కారు వెనుక సీట్లో కూర్చున్న స్త్రీకేసి మళ్ళించాడు. ఆవిడలో వులుకూపలుకూ లేదు. పెద్దిరెడ్డి కోపంతో బుసగొడుతూ కారుతలుపు దభీమని తెరిచి, ఆవిడ చేయి పట్టుకుని బలవంతంగా బయటికి లాగాడు. కట్టుకున్న పసుపుపూల ఆకుపచ్చ చీర పట్టుదొరక్క జెండా గుడ్డలా వేలాడుతుండగా, ఆవిడ శరీరం వొక్క విసురున తూలుతూ బయటికొచ్చింది. తాడు పట్టుకుని గొర్రెపిల్లను లాక్కెళ్ళినట్టుగా, ఆవిడ చేయి పట్టుకుని క్యూ దగ్గరికి నడిచాడు పెద్దిరెడ్డి. సుడిగాలితో పాటూ పరిగెత్తే యెండుకొమ్మలా ఆవిడ పెద్దిరెడ్డి వెంటపడి, కొట్టుకుపోసాగింది.

"యేమనుకోకుండా యీ క్యూలో కొంచేపు నిలబడండన్నా! అట్లా నిలబడకపోతే మందు పనిజెయ్యదు...." అంటూ చిన్నబ్బనాయుడు పెద్దిరెడ్డి వెంట వస్తున్న స్త్రీనే తదేకంగా చూడసాగాడు.

క్యూ పక్కన కొండపిల్లాడొకడు కోలాలూ, పెప్సీలూ, కుర్‌కురేలూ అమ్ముతున్నాడు.

దొంగచూపులు చూస్తున్న చిన్నబ్బనాయుడ్ని చూసి పళ్ళు పటపటా కొరుకుతూ "యెండ మండిపోతా వుండాది. యింక నిలబడింది చాల్లే! లోపలికి పదరా జబ్బార్!" అని కేకేశాడు పెద్దిరెడ్డి. అతడి డాబూ, దర్పం చూసిన మనుషులు తామేదో పొరబాటు చేసినట్టుగా కంగారు పడుతూ పక్కకు తప్పుకున్నారు. వాళ్ళను పట్టించుకోకుండా, ఆవిడ చేతిని పట్టుకుని లాగుతూ, పెద్దిరెడ్డి గుడిసెలోకి దూరేశాడు.

నలుగురు పడుకుంటే చిన్నదైపోయే గుడిసెలోపల, చెక్క బెంచీపైన కూర్చున్న వ్యక్తి తలపైకెత్తాడు. తెల్లపంచె తప్ప మరో ఆచ్ఛాదనలేని అతడి నల్లటి శరీరం చెమటోడ్చుతోంది. తెలుపూ నలుపుల జుట్టు పాయలు పాయలుగా అతడి భుజాల వరకూ వేలాడుతోంది. గుడిసెలోపలికొచ్చిన మగవాళ్ళెవరూ తన దృష్టిలో పడనట్టుగా ఆవిడనే చూస్తూ "బుద్ధిగా వచ్చి కుర్చో!" అని ఆజ్ఞాపించాడతను. ఆవిడ చప్పున తన చేతిని వూడలాక్కుని, అతను చూపెట్టిన చోట్లో చతికిలబడింది.

'చూశావా, అదీ యిక్కడుండే శక్తి!' అన్నట్టుగా పెద్దిరెడ్డికేసి చూస్తూ కన్ను గీటాడు చిన్నబ్బనాయుడు. గుడిసె వెనకున్న కిటికీలోంచీ అడవి నక్కి చూస్తోంది. కిటికీ కిందుగా కుంకుమ బొట్లున్న రాతిదేవుడి ముందు మట్టి ప్రమిదలోని దీపం గాలికి నాజుకుగా వూగుతోంది. దీపం పక్కన పగలగొట్టిన కొబ్బరికాయా, కుంకుమ పూసిన నిమ్మకాయ వప్పులూ పడివున్నాయి. వాటికి కాస్త దూరంలో చిన్నరాతిరోలూ, చెక్కరోకళ్లకవతల, యేవేవో ఆకులూ, కొమ్మలూ, వేర్లూ కుప్పగా పడివున్నాయి.

"అన్న చానా దూరంనించీ వచ్చుండాడు కొంఢ్రాజు సామీ! తలపల పెద్దిరెడ్డంటే హైద్రాబాదుదాకా యెత్తిన చెయ్యి. నీ మందు పనితనంపైన అన్నకు గురి కుదిరిందంటే, ఆపైన నీ దెబ్బకు తిరుగుండదు. నీ పేరు మోగిపోతింది" తలుపు వెనక నుంచీ నక్కుతూ లోపలికొచ్చిన చిన్నబ్బనాయుడు, లేని వుత్సాహాన్ని తెచ్చి పెట్టుకుంటూ చెప్పుకుపోయాడు.

కొంఢ్రాజు ఆవిడకేసి తిప్పిన చూపును మరల్చకుండా, "చెప్పు... నీ యిడుమేంది? యెందుకొచ్చినావు నా దగ్గిరికి?" అని రెట్టించాడు.

యెత్తుపల్లాలున్న నేలపైన వొరుగుతున్న పూలబుట్టలా ఆవిడ శరీరం పక్కకు వాలింది.

జబ్బార్ సాహేబు యెండుకుపోయిన పెదవుల్ని నాలుకతో తడుపుకుంటూ "వారంగా యేమీ గొంతుదిగలేదు సామీ! బలవంతంగా యేమైనా తినిపిస్తే, యెమ్మట్నే వాంతయిపోతా వుండాది. వొంటిపైన త్రాణే లేదు..." అని చెప్పాడు. కొంఢ్రాజు అతడ్ని ఆపమన్నట్టుగా చెయ్యి వూపి "నువ్వే చెప్పాల. నీ వొళ్ళెట్లుండాదో నీకు దెలిసినట్టుగా యింకో మనిషికి తెలవదు. నువ్వు సత్యం జెప్పాల. అప్పుడే సరైన మందు పడితింది" అని తేల్చేశాడు.

ఆమె వాల్చిన తలను పైకెత్తలేదు. పెద్దిరెడ్డి కోపంతో పళ్ళు కొరుకుతూ "చెప్పనసూయా! అడిగేది నిన్నే! నోరుదెరస్తావా లేదా నువ్వు?" అని హుంకరించాడు.

కొండ్రాజు గుప్పెడు తమలపాకులు తీసుకుని, అప్పటికే యెర్రగా పండిన తన నోట్లో కుక్కుకున్నాడు. పక్కనున్న ఆకులకుప్పలో దేన్నో వెతుకుతూ "సామీ! ఆడకూతురెందుకో బాగా బయపడుండాది. మీరంతా బయటికి పోండి. కావాల్లంటే ఆ మనిషిని మాత్రం వుండమనండి. యీ మాదిరి మనుషులు మంకు పట్టు పట్టేస్తారు. వీళ్లు నోరు దెరవాలంటే మీరు పొయ్యే కావాల్ల. రోగమేందో సక్రమంగా దెలిస్తేనే సరైన మందు పడేది.." అన్నాడు.

చిన్నబ్బనాయుడు పెద్దిరెడ్డికేసి చూసి "మనకు రోగం గుణమయ్యేదే గదన్నా ముఖ్యం... కావాలంటే మీ డ్రయివర్నుండమన్నాడు గదా! మనిద్దరం మా కాటేజీకి పోదాం పద.." అని ప్రాధేయపడ్డాడు. పెద్దిరెడ్డి యీసారి కొండ్రాజును మింగేసేలా వురిమి చూసి, జబ్బార్ సాహేబును కొట్టబోతున్నట్టుగా చెయ్యిపైకెత్తి, వొక్క విసురుతో గుడిసెలోంచీ బయటికెళ్ళిపోయాడు. వెళ్ళిపోతున్న అతడ్ని నివ్వెరపోయి చూస్తూ "మీ పెద్దాయనకంత కోపమెందుకు సాయిబూ? అంత వోపిక లేకపోతే ఆమె మొగుడ్నే అంపించుంటే సరిపోయ్యుండేది గదా! కూతురని గూడా జూడకుండా ఆ మాదిరి యెగిరి దూకతాడేంది? పైగా ఆమె వొళ్ళు తెలవకుండా కిందా మీదాపడతా వుండేటప్పుడు.." అని విస్తుపోయాడు చిన్నబ్బనాయుడు.

వెంటనే జబ్బారు సాహేబు జరగరాని తప్పు జరిగిపోయినట్టుగా తన చెంపలు తానే వాయించుకుని, పెద్ద అంగలేస్తూ వెళ్లిపోతున్న పెద్దిరెడ్డివైపుకు బెదురుచూపులు సారిస్తూ "కొంచెం మెల్లింగా మాట్లాడన్నా! అన్నగాని యిన్నాడంటే కొంపలంటుకోని పోతాయి. యీ అక్కనెవురనుకుంటావుండావు నువ్వు! యీమె యింటికొచ్చినాంకే అన్నకు అన్నీ కలిసొచ్చి యంపీటీసీ అయినాడు. అందుకే యీమెను నెత్తిన బెట్టుకోనుండాడు. యీమెను జూస్తే యింట్లో మనుషులే జంకతారు. సొంత పెండ్లాంకంటే జాస్తీగా జూసుకుంటా వుండాడన్నా!" అన్నాడు.

చిన్నబ్బనాయుడు తలగోక్కుని, అదోలా నవ్వేసి "పెద్దిరెడ్డా మజాకా! అందుకే అంత పేరు!" అని మెచ్చుకుని కొండ్రాజువైపుకు తిరిగి "తెలిసింది గదా! నీ మందు పవరేందో యిప్పుడు జూపించు" అని హెచ్చరించి, పెద్దిరెడ్డి నందుకోవడం కోసం గుడిసె బయటికి పరిగెత్తాడు.

అతడిని పట్టించుకోకుండా కొండ్రాజు కుండపెంకులోని నిప్పులపైకి గుప్పెడు పొడి చల్లాడు. సాంబ్రాణి పొగలు గుడిసెనంతా కమ్ముకుంటూండగా "యిప్పుడు చెప్పు తల్లీ! యెందుకు నీకు తిండి దిగదు? యెందుకు ఆకిలిగాదు?" అని మళ్లీ అడిగాడు.

"చానా దినాలుగా ఖాయిలా పడుండాది సామీ యీ అక్క! కండ్లు తిరిగేదీ, వొళ్లు తెలవకుండా పడిపొయ్యేదీ... రెండు మూడు నెలలుగా నిభాయించేదానికి కాకుండా వుండాది. మన్నుదిన్న పాముమాదిరిగా గొమ్ముగా ముడుక్కోని పండుకోని వుండిపోతాది. బలవంతంగా రెండు మెతుకులు మింగిస్తే అట్నే వాంతయిపోతావుండాది. పలకరించినా పలకదు. చూసేదానికే కష్టంగా వుండాది" జబ్బార్ సాహేబు దీనంగా చెప్పాడు.

"యిప్పుడిక్కడింకెవ్వరూ లేరు గదమ్మా! బయమొద్దు... నీకేంగావాల? అడుగుతల్లీ!" కొండ్రాజు ఆవిడను మాట్లాడించే పనిలో అలసిపోవడం లేదు.

"నాలుగైదేండ్లకు ముందు, అన్న యింటికి తొడుక్కోనొచ్చినప్పుడు, కోతకొచ్చిన మామిడి చెట్టు మాదిరిగా జమాయిస్తా వునింది సామీ యీ అక్క! ఆ మాదిరునింది కొన్ని దినాలే! మా పెద్దన్నొకతూరి హార్సిలీ హిల్సుకు తొడుక్కోని బొయినాడు. సరైన తావులో రూములు దొరకలేదంట! అదేదో పాత బంగ్లాలో దిగినారంట! అక్కడే యీ గాలొచ్చి పైన కుచ్చునేసింది. అంతే! అప్పట్నించీ అక్క దినదినానికీ తీసిపోతానే వుండాది" జబ్బార్ సాహేబు గొంతు జీరబోయింది.

"యీ తావుకొచ్చే వాళ్లంతా గాలనీ, దెయ్యమనే చెప్తారు. అదేదో పైకొచ్చినప్పుడు యేం జరగతా వుండాదో అది చెప్పు" కొండ్రాజు అనసూయవైపుకు వంగి, ఆమె చేతిని బలవంతంగా తీసుకుని, నాడి కోసం వెదకసాగాడు.

"అది పైకొచ్చినపుడు... యీ మాదిరిగా వొళ్లూ గిళ్లూ తెలవదు..." జ్ఞాపకం చేసుకోవడానికి ప్రయత్నించాడు జబ్బార్ సాహేబు. "వొకోతూరి వూరికే గట్టిగట్టిగా అరస్తాది. వొకోతూరి వూరికివూరే కాలిపోతా వుంటే గూడా కిముక్కుమనదు. తిండిగిండీ అనకుండా కడుపులోకి కాళ్ళు దూర్చుకోని పండుకుంటాది..." కొండ్రాజు ఆకులకుప్పను కదుపుతూ "మందిస్తాను. అయితే ముందు తావు మార్చాల... యీ తల్లిని కొన్ని దినాలు ముందుండిన తావుకే అంపీయండి" అన్నాడు.

"వచ్చిన తావుకా? అదెట్ల కుదిరితింది సామీ!" తెలియకుండా చీమలపుట్టపైన అడుగుపెట్టిన వాడిలా జబ్బార్ సాహేబు యెగిరి గంతేశాడు.

"అది జరిగే పని కాదు.. యింకేదైనా చెప్పు" అంటూ యేడవబోయాడు.

"వచ్చినప్పుడు బాగునిందన్నావు నువ్వు! అందుకే యాడినించీ వచ్చిందో, ఆ తావుకే అంపించాల... అప్పుడు గానీ మందు పనిజెయ్యదు. రోగం గుణం గాదు. ఆ తావుకు అంపిస్తేనే పని జరిగితింది" కసిరాడు కొంౘ్రాజు.

"నీకు చెప్తే మూలకెక్కటం లేదా సామీ!" జబ్బార్ సాహేబు యీసారి అనసూయకేసి బెదురు చూపులు చూస్తూ చెప్పసాగాడు. "అన్న యీ అక్కను యేవూరి నుంచీ తొడుక్కోనొచ్చినాడో మాకు తెలవదు. కాని అదేందో లాడ్జినించో, కంపెనీ నించో తొడుక్కోనొచ్చినాడని మాత్రం యింటిమనుషులే జెప్పినారు. యీ మాదిరి బంగారట్లా పిల్ల ఆ మాదిరి తావులో వుండేది మంచిదిగాదని, అన్న దుడ్డు బాగా సెలవుజేసి, యింటికి తెచ్చుకున్నాడు. యీ మాట యెవురితో అనద్దు. నేనీ నామాట జెప్పినానని తెలిస్తే అన్న నా చావు సదరం జేసేస్తాడు..."

యింకా ఆకులు వెతుక్కుంటూన్న కొంౘ్రాజు చెవి దగ్గరికి వంగి "మనమింత ఆలగోలంగా వుంటే ఆ అక్క చెవులకేమైనా యెక్కతావుండాదేమో జూడు సామీ! బెల్లంగొట్టిన రాయి మాదిరిగా కుచ్చోనుండాది గదా! ఆ తప్పుదు కొంపల్లో వుండే యిట్లాంటోళ్ళకు యెప్పుడూ అదే యావంటలే! వొకే వొక మొగోనితో గుట్టుగా సంసారం జేసుకోమంటే వీళ్ళకు కాబట్టదంట! యీ మాదిరి మనుషుల్నే యెతుక్కోనొచ్చి, గాలిపట్టుకుంటిందంట గదా!" అని అడిగాడు.

కొంౘ్రాజు కోపంతో రుసరుసలాడాడు.

జబ్బార్ సాహేబు తడబడుతూ "యిదంతా వాళ్ళింట్లో వుండే మనుషులే చెప్తావుంటే యిన్నాను. లేకుంటే నాకెట్ల తెలిస్తింది? మందూ మాకూ లేని రోగమేమో అని వాళ్ళ అనుమానం. ఆ మాటే నిజమయ్యుంటే ఆ రోగమేందో మా పెద్దన్నకు గూడా వచ్చుండాల గదా?" అంటూ ఆగిపోయాడు.

కొంౘ్రాజు విసుగ్గా ఆకుల్ని పక్కకు తోసి "మందాకు అయిపొయ్యుండాది. తెప్పించి మందుజేసిస్తాను. యింకోజామయినంక గనపడు... బిడ్డను భద్రంగా తొడుక్కోనిపో..." అని మందలించాడు.

అనసూయకేసి బిక్కుబిక్కుమని చూస్తూ "పదక్కాపోదాం" అని పిలిచాడు జబ్బార్ సాహేబు. ఆమెలో చలనం లేదు. అతను బెదురుతూనే ఆమె చేయి పట్టుకుని పైకి లాగుతూ "యీ మాదిరి పట్టుకున్నానని దెలిస్తే పెద్దన్న నన్ను పొలిబెట్టేస్తాడు. యీ అక్కేమో గుండుమాదిరి కుచ్చుంటాది. కరిస్తే పాముకూ, యిడిస్తే కప్పకూ కోపమయితే యేం జెయ్యాల చెప్పు!" అని ఆక్రోశించాడు.

ఆవిడ చేయి పట్టి లాగుతూ జబ్బార్ సాహేబు గుడిసె బయటకు రాగానే, ఖద్దరు చొక్కా యువకుడొకడు దగ్గరికొచ్చి "అన్నోళ్లిద్దరూ ఆ కాటేజీలో వుండారు" అని దారి చూపెట్టాడు.

మధ్యాహ్నం రెండు గంటల సేపు మాత్రమే లోయలోకి తొంగిచూసే సూర్యుడు అప్పుడు పడమటి కొండల వెనక్కు జారుకున్నట్టున్నాడు. లోయ చేతులతో పట్టుకున్న విసనకర్రల్లా చెట్లన్నీ కదులుతున్నాయి. క్యూలో పడిగాపులు పడుతున్న మనుషుల కోసం కొండకుర్రాడొకడు తినుబండారాలు అమ్ముతున్నాడు. పాకముందున్న ఆరు బయలు హోటల్లో కొందరు భోజనాలు కానిస్తున్నారు.

కాటేజీ ముందుకొచ్చాక అనసూయ చేతిని విడిచిపెట్టి, వోరగా మూసిన తలుపును ముందుకు తోశాడు జబ్బార్ సాహేబు. లోపల సోఫోలో కూర్చున్న వ్యక్తుల్ని చూడగానే వులిక్కిపడ్డాడు.

చిన్నబ్బనాయుడు అనసూయకేసి వోరగా చూస్తూ "యింతసేపు యేం జేసినారు? యీ కొండ్రాజు పెద్ద యంబీబీయస్సు డాక్టరనుకుంటా వుండాడు" అని కోప్పడ్డాడు.

"మందాకయి పొయ్యిందంటన్నా! యింకొంచేపు అయినంక తయారుచేసి అంపిస్తానన్నాడు" అన్నాడు జబ్బార్ సాహేబు. బొమ్మలా నిల్చున్న అనసూయను గుడ్లురిమి చూస్తూ "యిట్లా లోపలికొచ్చి రెస్టు తీసుకో!" అని గర్జించాడు పెద్దిరెడ్డి. అంతవరకూ ముందుకు రాకుండా మొరాయించిన వ్యక్తి, వెంటనే సోఫాల వెనకుండే వెదురుతడిక అవతలికి చకచకా వెళ్ళడం చూసి జబ్బార్ సాహేబు విస్తుపోయాడు.

"యీ కొండ్రాజు పెగ్గె జూసినావాన్నా! బొత్తిగా విశ్వాసంలేని మనిషి... నా గెస్టులని తెలిసినా యింతసేపు వెయిట్ జెయ్యిస్తావుండాడు" అని మండిపడ్డాడు చిన్నబ్బనాయుడు. తరువాత జబ్బార్ సాహేబుతో "ఆ పక్కనుండే హోటల్‌కు పో... కావల్సింది అడిగి తిను... దుడ్డేమియ్యద్దు... నా పేరు జెప్పు అడిగితే..." అన్నాడు.

తడిక అవతలున్న మంచంపైకి అనసూయ వొరిగినట్టు గమనించాక "ఫైవ్ స్టార్ హోటల్‌కు తీసిపోదు నాయుడూ నీ కాటేజీ! కావల్సినవన్నీ వుండాయి" అని మెచ్చుకున్నాడు పెద్దిరెడ్డి.

"వస్తావుండానని ముందుగా వొక మాట చెప్పంపించివుంటే అన్నీ రెడీ జెయ్యించి వుండనా అన్నా! యేట మాంసం, జీలుగుమందూ అన్నీ వచ్చేసుండు.." అన్నాడు చిన్నబ్బనాయుడు వుత్సాహంగా. అంతలోనే నీరసపడిపోయి "యీ యిలాకాలో నా మాటకు తిరుగులేదన్నా! అయితే యీ కొండపాళెం మాత్రం నన్నెగరేసి మాట్లాడతా వుండాది.

నేను పూనుకోని, పెద్దోళ్ళతో జెప్పి, రోడ్డెయ్యించినాంకే యీ వైద్యం సంగతి లోకానికి తెలిసింది. అంతకు ముందు వొకరిద్దురు తారట్లాడుకుంటావచ్చి మందు తీసుకోని పోతా వుండినారు. యిప్పుడు జూడు, తిరునాళకొచ్చినట్టు వస్తావుండారు. వచ్చిన పేషంట్ల దగ్గిర ఫీజు వసూలు జేద్దామంటే ఆ కొండ్రాజు వొప్పుకోడు. దుడ్డు దీసుకుంటే మందు పని జెయ్యదంటాడు. వానికి తెలవకుండా మనోళ్ళు కొంచెం వూడబెరుక్కుంటా వుండారు. లేకపోతే యీ ఖర్చులకంతా యెక్కడి నించీ వస్తాది? గిచ్చిగీపెడితే యిప్పుడు ఆకు ఖర్చు కింద తలా యిరవై రూపాయలు దీసుకునే దానికి వొప్పుకున్నాడు. అదే మూలకు సరిపోతింది?" అని నిట్టూర్చాడు.

పెద్దిరెడ్డి సోఫోలో వెనక్కువాలి, వొళ్ళు విరుచుకుంటూ "యీ తావులో పెద్దనిధే దొరికిందనీ, అందుకే దీనికింత ప్రభ వచ్చిపడిందనీ అందురూ అంటా వుండార్లే నాయుడూ! అయితే ఆ దొరికిందేదో నీకే అని యిప్పుడు తెలస్తావుంది" అన్నాడు.

చిన్నబ్బనాయుడు వులిక్కిపడి "నిధా! అట్లాంటిదేమీ లేదన్నా! అంతా వొట్టి గాలిపుకార్లు... లేకుంటే యిప్పుడీ మందుపైన జనాలకు గురి కుదిరింది. దినమ్మూ జీబుల్లో, ఆటోల్లో వచ్చి జనాలు దూకేస్తావుండారు. నేను పైనుండే వాళ్ళతో మాట్లాడి కరెంటు తీగలు లాగించినాను. రేపో మర్నాడో టెలిఫోను తీగలు గూడా వస్తాయి. యీ లోపల ప్రయివేటు సెల్‌ఫోనోళ్ళు టవర్లు గట్టేస్తామంటావుండారు. యీ వూర్లో వుండే కొండోళ్ల చేతే అంగళ్ళు బెట్టించినాను. హోటల్లు పెట్టుకునే దానికి అప్పులిచ్చినాను. యిన్ని మేళ్ళు జేసినా వీళ్ళు మాత్రం మనల్ని దొంగల్ని జూసినట్టే చూస్తా వుండారు. యీ మనుషులకు దుడ్డంటే గూడా ఆశ లేదు. కొమ్మలపైనా, గుండ్లపైనా అడివి మెకాల మాదిరిగా బతికేస్తామంటారు" అన్నాడు.

తడిక కవతల గాజులు కదలాడాయి. పెద్దిరెడ్డి విసుగ్గా లేచి లోపలికెళ్ళాడు. కాస్సేపటి తర్వాత తిరిగొచ్చి "తిండి సరిగ్గా తినకపోతే కండ్లు దిరిగి పడదా చెప్పు! తీరికుచ్చోనుండాది. నా మాట సరిగ్గా యినుంటే యీ మాదిరి గుంజాటన పడుండేదా చెప్పు! అంతా తలరాత!" అని వాపోయాడు.

"యీ మందు రెండు దినాలు తిన్నాంక చూసుకోన్నా! జమ్మని లేచి తిరక్కపోతే అప్పుడడుగు..." అని సముదాయించాడు చిన్నబ్బనాయుడు.

"అందుకే గదా యింత దూరం వచ్చింది. నావల్లయిందంతా చేస్తావుండాను. విని బాగుపడితే పడనీ... లేకపోతే... బుద్ధి భూములేలమంటే యింకేందో అయ్యిందంట... ఫ్చ్... యీ లోకంలో మంచికి తావు లేదు నాయుడూ!" పెద్దిరెడ్డి గొంతు గద్గదమైపోయింది.

"ఆ మాట మాత్రం నిజమన్నా! మంచికి యీ లోకంలో తావే లేదు. నామాట సరిగ్గా వినుంటే యీ వూరికి వూరే మారిపొయ్యిండదా చెప్పు! అంతా వాళ్ళ తలరాత! మన వల్లయింది యింతే!" యిప్పుడే దెబ్బ తగిలినట్టుగా చిన్నబ్బనాయుడి గొంతు విలవిలలాడింది.

"నిజమే! మన తలరాత యిట్లుండాది! లేకపోతే నాయుళ్ళ పార్టీలో జేరి నేనూ, రెడ్ల పార్టీలో జేరి నువ్వూ వుద్ధరిస్తా వుండేదేముండాది? నన్ను వీళ్ళు నమ్మరు. నిన్ను వాళ్ళూ నమ్మరు" అని తేల్చేశాడు పెద్దిరెడ్డి. అవునన్నట్టుగా తలవూపుతూ "ఆ మందు దేంతో చేస్తారో తెలుసుకునేది కష్టంగాదు. అయితే అంతా ఆ మనిషి చెయ్యిరాశిలో వుండాది. అదే మందు యింగొకరు యిచ్చినా అంతగా పనిజెయ్యటం లేదు... అట్లా మాదిరి మనిషి నెట్ల సాధించాల్నో చెప్పు!" అంగలార్చాడు చిన్నబ్బనాయుడు.

తడిక కవతల మళ్లీ గాజులు గలగలమన్నాయి. చిన్నబ్బనాయుడు కుతూహలంగా తలవంచి చూసాడు. పెద్దిరెడ్డి ధిగ్గున పైకిలేచి, తడిక కవతలికి అడుగేసి "అట్ల తిరిగి పడుకో... వూరికే రవరవమనద్దు.." అని కసిరాడు. పట్టుబడిన దొంగలా కంగారుపడుతూ పైకిలేచి "మందేమైనా తయారయ్యిందేమో చూసేసొస్తానుండన్నా!" అంటూ చిన్నబ్బనాయుడు కాటేజీ బయటికొచ్చేశాడు.

"ఆ హోటలోడు యెంత బలంతం జేసినా దుడ్డు తీసుకోలేదన్నా!" అని పరవశంగా నవ్వుతూ జబ్బార్ సాహేబు యెదురొచ్చాడు.

చిన్నబ్బనాయుడు హుందాగా తలపంకించి, జేబులోంచీ వందరూపాయల నోటు తీసి అతడికిచ్చాడు. మరో పదడుగులు వేశాక, తన వెంటే వస్తున్న జబ్బార్ సాహేబుకేసి చూస్తూ కన్ను గీటి "యీ మధ్యలో మీ పెద్దిరెడ్డికేందో నిధి దొరికిందట గదా! అదొచ్చినాక ఆయినింట్లో నీళ్లు గూడా పెట్రోలుమాదిరిగా వెలిగిపోతా వుండాయంట గదా!" అని వాకబు చేసాడు.

జబ్బార్ చిత్రంగా సిగ్గుపడుతూ "అంతా గాలిమాటలేన్నా! అయితే వొక మాట మాత్రం నిజెం. యీ నడుమ మా అన్నకు సుడిదిరిగిందని అందురూ అంటా వుండారు. ఆమాటే మా అన్నతో గూడా చెప్పినాను వొకతూరి. ఆయన 'నోర్మూసుకోరా బద్మాష్' అని తిడతానే నవ్వినాడు" అన్నాడు.

చిన్నబ్బనాయుడు వున్నట్టుండి నడవడం ఆపి "అదేందో యేనుగు పగడమంట! తిరిగి తిరిగి అది మీ పెద్దిరెడ్డి చేతిలో పడిందంట గదా?" అని ప్రశ్నించాడు.

"యేనుగు పగడమా? అంటే... అదేందన్నా?" అంటూ జబ్బార్ సాహేబు నోరు తెరిచేశాడు.

"పెద్ద గుండ్రాయంతుండే పగడమంటలే! అది దగ్గిరుంటే యింక యెదురే వుండదంట గదా! అదెట్లయినా కావాల నాకు.. మూడో కంటికి తెలవకుండా నాకు తెచ్చిచ్చినావే అనుకో, నీకేం గావాలంటే అదిస్తాను" అని రాదీశాడు చిన్నబ్బనాయుడు.

జబ్బార్ సాహేబు అయోమయంగా తలగోక్కుంటూ "ఆ మాట యిప్పుడే తొలీ తడవ యింటావుండానన్నా! యింకా పచ్చులశంఖం సంగతి చెప్పు... దాన్ని గురించి చానా యిన్నాను" అన్నాడు.

"పచ్చుల శంఖమా? అదేంది?" చిన్నబ్బనాయుడు ఆశ్చర్యపోయాడు.

"నాకు మాత్రం యేం దెలుసునన్నా! అదేందో యీ పక్కనే దొరికిందనీ, అప్పుట్నించే యీ తావు యీ మాదిరి యెక్కి వస్తావుండాదనీ తెలిసింది. మా అన్న గూడా యీ తావుకొచ్చినప్పుట్నించీ దాన్నే కలవరిస్తా వుండాడు" అన్నాడు జబ్బార్ సాహేబు నసుగుసులు పడుతూ.

చిన్నబ్బనాయుడు అతడ్ని నమిలి మింగేసేలా ఉరిమి చూస్తూ "నీ పెద్దిరెడ్డికిప్పుడు జరగతా ఉండే దర్బారు చాలదా? ఇంకా ఏం కావాలని పచ్చల శంఖాల కోసం ఎతకతా ఉండాడు?" అని కసిరాడు.

జబ్బార్ సాహేబు చేతులు నలుపుకుంటూ "ఏమో అన్నా! చూడబోతే ఆయనకేం గావాల్నో ఆయనకే సరిగ్గా తెలిసినట్టు లేదు. లేకపోతే ఈ భూలోకంలో ఎక్కడా దొరకని వాటికోసరం ఎతికేదెందుకు చెప్పు?" అని వాపోయాడు.

అప్పుడే అక్కడికొచ్చిన ఖద్దరు చొక్కా యువకుడితో "ఆ మందు తయారయ్యిందా లేదా? యింకా ఆలస్యం చేస్తేనేనొప్పుకోను. నేనసలే మంచోడ్ని గాదు. పొయి ఆ కొండ్రాజును రెండు జూడించేసి రా పో!" అని కేకేశాడు చిన్నబ్బనాయుడు.

30-6-2013 ఆదివారం ఆంధ్రజ్యోతి